నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 15 ఏప్రిల్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## రోడ్డు ఇలా.. వెళ్లేదెలా..?



సిర్పూర్(టీ) మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ అర్అండ్‌బీ ప్రధాన రహదారి మరమ్మతులో భాగంగా పోసిన కంకర

సిర్పూర్(టీ), ఏప్రిల్ 14 : మండలకేంద్రంలోని బస్టాండ్ నుంచి కౌటల ప్రధాన రహదారి, బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్ ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సుమారు రెండు నెలల క్రితం రైల్వేస్టేషన్ రహదారిలో మరమ్మతులు ప్రారంభించారు. మొదట రోడ్డును తవ్వి కొన్ని రోజులు అలాగే వదిలేయగా, 15 రోజుల క్రితం అదే రోడ్డుపై కంకర పోసి పనులు నిలిపివేశారు. దీంతో నవేగాం, హడ్కులీ, జక్కాపూర్, మాకిడి గ్రామస్తులతో పాటు మహారాష్ట్ర ప్రయాణికులు, వాహనదారులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.



మందమర్రిలో టీబీజీకేఎస్ సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న నాయకులు

## కార్మిక హక్కులు సాధించిన ఘనత టీబీజీకేఎస్‌దే

మందమర్రి, ఏప్రిల్ 14 : సింగరేణిలో అనేక హక్కులు సాధించిన ఘనత టీబీజీకేఎస్‌కే దక్కుతుందని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జే.రవీందర్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్ అన్నారు. ఆదివారం మందమర్రి పట్టణంలోని యూనియన్ కార్యాయంలో టీబీజీకేఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పటి బీఆర్ఎస్ సర్కారు సహకారంతో గుర్తింపు సంఘంగా సింగరేణి బొగ్గు గని కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు అనేక హక్కులు సాధించామన్నారు. దశాబ్దాల క్రితం రద్దయిన డిపెండెంట్ ఎంప్లాయ్‌మెంట్ పథకాన్ని కారుణ్య నియామకాల పేరిట తిరిగి పునరుద్ధరించిన ఘనత తమ యూనియన్‌దేనని తెలిపారు. యూనియన్ నాయకులు, కార్యకర్తలు సభ్యత్వ నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు సంపత్, ఓ.రాజశేఖర్, ఈశ్వర్, బెల్లం అశోక్, ముల్కలపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కొప్పుల ఈశ్వర్



వేమనపల్లిలో మాట్లాడుతున్న పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

# సైనికుల్లా పనిచేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలి

- కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, పథకాలను ప్రజలకు వివరించాలి
- కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలి
- బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్
- వేమనపల్లిలో మాజీ ఎమ్మెల్యే చిన్నయ్యతో కలిసి కార్యకర్తల సమావేశం
- అంబేద్కర్‌కు ఘన నివాళి

వేమనపల్లి, ఏప్రిల్ 14 : కార్యకర్తలు, నాయకులు సైనికుల వలే పనిచేసి బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని మాజీ మంత్రి, పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. ఆదివారం వేమమనపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చావునోట్లో తలకాయపెట్టి తెలంగాణను సాధించారని, పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపారని కొనియాడారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించారని, ప్రధానంగా రైతుల కోసం ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టారని, 24 గంటల ఉచిత కరంట్ అందించారని, రైతుబంధు, రైతుబీమాతో అండగా నిలిచారని చెప్పుకొచ్చారు. ప్రజలకు మన సర్కారు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. నాలుగు నెలలు గడిచినా 'ఆరు గ్యారెంటీల' ఊసెత్తడం లేదని, ఆ పార్టీ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం కల్పించారని, ప్రతి ఒక్కరూ కారు గెలుపుకోసం కృషి చేయాలని కోరారు.

**కార్యకర్తలకు అండగా ఉంటాం : మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య**

పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలు, నాయకులకు ఎల్లవేళలా అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పేర్కొన్నారు. వేమనపల్లి మండల అభివృద్ధిని గతంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదని, తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మండలాన్ని అన్ని రంగాల్లో ప్రగతి పథంలో నడిపించి ఆదర్శంగా నిలిపానని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎవరిపై తప్పుడు కేసులు పెట్టలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొన్ని రోజులకే బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తుందని మండిపడ్డారు. పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోలి వేణుమాధవ్‌రావు, ఎంపీపీ కోలి స్వర్ణలత, వైస్ ఎంపీపీ ఆత్రం గణపతి, ఎంపీటీసీ దాగామ బాపు, సింగిల్ విండో చైర్మన్‌కుబిడె వెంకటేశం, మాజీ ఎంపీపీ కుర్రు వెంకటేశం, మాజీ సర్పంచు కుబిడె మధు, మాజీ ఎంపీటీసీకోరెకొప్పుల అశోక్‌గౌడ్, పురాణం లక్ష్మీకాంత్ , మాజీ జడ్పీటీసీ తలండిభీమన్న, సంతోష్, రవి, రజాక్, మాజీ సర్పంచులు లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కొప్పుల ఈశ్వర్, దుర్గం చిన్నయ్య అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

## అండగా ఉంటాం : ఎమ్మెల్యే కోవ లక్ష్మి



ఇందిరానగర్‌లో మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన, ఏప్రిల్ 14 : ఇందిరానగర్ గ్రామానికి చెందిన వడ్లూరి గణపతి, దుర్గం చిన్నయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పరామర్శించారు. అధైర్యపడవద్దు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ప్రమాదాలు జరుగుతున్న రోడ్డును పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, వైస్ ఎంపీపీ గజ్జల సత్యనారాయణ, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ శంకరమ్మ, నాయకులు పల్లె రాజేశ్వర్‌రావు, జుమ్మిడి ఆనందరావు, తిరుపతిగౌడ్, దుర్గం తిరుపతి, పద్మ ఉన్నారు.

### ట్రైన్‌లో మహిళ మృతి

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 33 : ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ మహిళ అనారోగ్యంతో ట్రైన్‌లో మృతి చెందింది. కడపకు చెందిన పడమటింటి లక్ష్మి (37)కి కొన్ని రోజుల క్రితం జ్వరం వచ్చింది. ఆదివారం బెల్లంపల్లి సమీపంలోని సోమగూడెం కల్వరి చర్చిలో ప్రార్థన చేసేందుకు వచ్చింది. ఆపై తిరిగి గోరక్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో ఇంటికి బయలుదేరగా, బెలంపల్లి, మంచిర్యాల రైల్వేమార్గంలో అనారోగ్యంతో మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

## గోలేటిలో దుప్పి మృతి

రెబ్బెన, ఏప్రిల్ 14 : గోలేటి గ్రామ శివారులో ఆదివారం దుప్పి మృతి చెందింది. కుక్కల గుంపు దుప్పి వెంట పడడంతో తప్పించుకునే ప్రయత్నంలో శ్రీ భీమన్న మైదానం వద్ద గల ఫెన్సింగ్‌ను దూకడంతో గాయపడి మృతి చెందింది. స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో బీట్ ఆఫీసర్లు రవి, అనిల్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని దుప్పి కళేబరాన్ని గోలేటి అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లి ఖననం చేశారు.



దుప్పి కళేబరం

# బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- కాంగ్రెస్‌కు ఓటేసి మరోసారి పొరపాటు చేయవద్దు
- మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు
- ర్యాలీగఢ్‌పూర్‌లో ప్రచారం

హాజీపూర్, ఏప్రిల్ 14 : బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని ర్యాలీగఢ్‌పూర్ గ్రామంలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే ఏమి జరిగిందో అందరికీ తెలుసని, మళ్లీ అలాంటి పొరపాటు చేయవద్దని ప్రజలకు సూచించారు. పల్లెలను అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపింది బీఆర్ఎస్ కాదా అని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు భారీ మెజార్టీ ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట మండల అ ధ్యక్షులు మొగిళి శ్రీనివాస్, గోపతి లక్ష్మయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు

## వడ్డీ వ్యాపారుల ఇళ్లలో సోదాలు

లక్షెట్టిపేట, ఏప్రిల్ 14: పట్టణంతో పాటు మండలంలో అక్రమంగా వడ్డీ వ్యాపారంతో పాటు అనుమతులు లేని చీటీలు నడిపిస్తున్న వారి ఇళ్లలో ఆదివారం పోలీసులు సోదాలు నిర్వహించారు. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మండె సత్యం ఇంట్లో సుమారు 30కి పైగా ప్రామిసరీ నోట్లు, చెక్కులు, బాండ్‌పేపర్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు. అనుమతులు లేకుండా చీటీల వ్యాపారం చేసినా, అధికంగా వడ్డీలు వసూలు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.



పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ



ఆసిఫాబాద్ : అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి



మంచిర్యాల : పూల మాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

## అంబేద్కర్‌కు ఘన నివాళి

- ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో ఘనంగా రాజ్యాంగ నిర్మాత జయంతి
- నివాళులర్పించిన కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు

ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో భారతరాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 133వ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్లు వెంకటేశ్‌దోత్రే, బదావత్ సంతోష్, ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్‌రావు, వివేక్, కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్య, ఆత్రం సక్కుతో పాటు వివిధ సంఘాల నాయకులు పాల్గొని ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాలాభిషేకాలు చేశారు. పంచశీల జెండాలను ఎగరవేశారు. ప్రధాన చౌరస్తాల్లో ర్యాలీలు తీస్తూ నినాదాలు చేశారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం విశేష కృషి చేసి మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు.



అంబేద్కర్ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దో త్రే



మంచిర్యాల: నివాళులర్పిస్తున్న కలెక్టర్ బాదావత్‌సంతోష్



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

# ఎలక్షన్‌పై అలర్ట్

- పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా యంత్రాంగం కసరత్తు
- 100 శాతం ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు
- నిత్యం సమీక్షలు నిర్వహిస్తూ అప్రమత్తం చేస్తున్న కలెక్టర్, ఎస్పీ
- పెరిగిన పోలింగ్ కేంద్రాలు
- 47 సమస్యాత్మక, 22 మావోయిస్టు ప్రభావిత కేంద్రాలపై నిఘా
- పల్లెల్లో విస్తృతంగా పోలీసుల కవాతు



ఝరిలో సీఆర్పీఎఫ్ బలగాలు



సిర్పూర్-యు : నెట్నూర్ గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ) : రాబోయే పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు, ఓటర్లు 100 శాతం ఓటు హక్కును వినియోగించుకునేందుకు అధికారులు, పోలీ సు యంత్రాంగం కసరత్తు చేస్తున్నది. కలెక్టర్ వెంకటేశ్‌దోత్రే, ఎస్పీ సురేశ్‌కుమార్ నిరంతరం అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ అప్రమత్తం చేస్తున్నారు. జిల్లాలో గుర్తించిన 47 సమస్యాత్మక కేంద్రాలతో పాటు 22 మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. నెట్‌వర్క్ లేని పోలింగ్ కేంద్రాలు గతంలో 39 ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 56కు చేరింది. పోలింగ్ రోజున ఆయాచోట్ల ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

**ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాలు**

మే 13న జరుగునున్న పార్లమెంట్ ఎన్నికలకు అధికారులు సంసిద్ధమవుతున్నారు. ఫిబ్రవరి 8వ తేదీ వరకు ఏర్పాటు చేసిన ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో 4,55,437 మంది ఓటర్లు ఉన్నారు. గతంలో 597 పోలింగ్ కేంద్రాలుండగా, ఓటర్ల సంఖ్యను బట్టి 676 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గత అనుభావాలను దృష్టిలో పెట్టుకొని పోలింగ్ సిబ్బందికి, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల్లో పాల్గొనే ఉద్యోగి తమ సొంత జిల్లాలో లేదా నియోజకవర్గంలో ఓటు వేసే అవకాశం కల్పించారు. పోస్టల్ ఉద్యోగులు మే 3 నుంచి 8వ తేదీవరకు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.

**ఎన్నికల కోడ్..**

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే వెంటనే ఫిర్యాదులు చేసేందుకు 1950తో పాటు 08733279033 నంబర్లను అందుబాటులో ఉంచారు. ఇక పోలీసులు నిత్యం తనిఖీలు నిర్వహిస్తూ నగదుతో పాటు మద్యం, వివిధ వస్తువులను స్వాధీనం చేసుకుంటున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు గ్రామాల్లో పెద్ద ఎత్తున సీఆర్పీఫ్ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్‌లు నిర్వహిస్తున్నారు. ఓటర్లు తమ ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

**ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం..**

ఫారం-12 ద్వారా దివ్యాంగులు, వృద్ధులు ఇంటి నుంచే ఓటు వేసే విధంగా అవకాశం కల్పించారు. ఇందుకోసం ముందుస్తుగా తమ పేరును నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలో ఇలాంటి ఓటర్లు 9,566 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. 40శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్నట్లు సర్టిఫికెట్ ఉంటే ఇంటి నుంచే ఓటు వేయవచ్చని అధికారులు చెబుతున్నారు.

# మందుబాబుల వీరంగం

- మద్యం మత్తులో ఒకరిపై దాడి
- సోషల్ మీడియాలో వైరల్

మంచిర్యాల ఏసీసీ, ఏప్రిల్ 14 : జిల్లా కేంద్రంలోని ఓ బార్ ఏరియాలో శనివారం అర్ధరాత్రి తాగుబోతులు వీరంగం సృష్టించారు. మద్యం మత్తులో కొందరు యువకులు ఓ వ్యక్తిని చితకబాదిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. శనివారం రాత్రి కొందరు యువకులు స్థానిక బార్‌లో మద్యం తాగి.. ఆపై బార్ బయటకు వచ్చి గొడవ పడుతుండగా, ఓ వ్యక్తి వారికి గొడవ పడవద్దని సూచించాడు. దీంతో వారంతా అతడిపై దాడి చేసినట్లు తెలిసింది. మందుబాబుల బారి నుంచి తప్పించుకునేందుకు అతడు పరుగులు తీస్తుండగా, వెంటపడి మరీ క్రికెట్ బ్యాట్, వికెట్లతో విచక్షణారహితంగా దాడి చేసి పారిపోయారు. తీవ్రంగా గాయపడ్డ సదరు వ్యక్తిని ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు సమాచారం. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. ఈ విషయమై పట్టణ సీఐ బన్సీలాల్‌ను వివరణ కోరగా, శనివారం రాత్రి పదిన్నర సమయంలో రెండు వర్గాలు తాగిన మైకంలో గొడవ పడ్డాయని, ఇరువురికి గాయాలయ్యాయని, ఆదివారం ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.



ఓ వ్యక్తిని రోడ్డు పై పడేసి చితకబాదుతున్న యువకులు